# రిటైర్‌మెంట్

మంగపతిరావు రాత్రి ఏడున్నర గంటలకి, మెడలో పూలదండ, చేతిలో మిఠాయిల ప్యాకెట్లు, అడుగున్నర ఎత్తున్న వాటర్ ఫిల్టర్‌తో ఇంటి ముందు రిక్షా దిగాడు.

అందాకా అక్కడే కూర్చుని భర్త రాకకోసం ఎదురుచూసిన వర్ధనమ్మ అంతక్రితమే లోపలికెళ్ళి నడుం వాల్చింది.

"ఇదిగో వర్ధనం" అంటూ హడావిడిగా, ఆనందంతో కలిసిన ఉద్రేకంతో పిలిచాడు మంగపతి.

వర్ధనమ్మ చటుక్కున లేచి భర్తకి ఎదురెళ్ళి అతన్ని చూసి ఒక్కక్షణం నివ్వెరపోయి అంతలోనే సర్దుకుంది.

మంగపతి తన చేతుల్లోని బరువునంతా భార్యకిచ్చి రిక్షాలో వున్న వాటర్ ఫిల్టర్ తెచ్చేందుకు బయటకెళ్తుంటే అతని మెడలో కొండచిలువలా కదులుతున్న పూలదండ చూసి కొంచెం నవ్వుకుంది వర్ధనమ్మ.

"అయిపోయిందే వర్ధనం. ఈ రోజుతో 33 ఏళ్ళ ఉద్యోగ జీవితానికి స్వస్తి చెప్పడం అయిపోయింది" ఆయాసంగా, ఆనందంగా బొజ్జ ఊపుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు మంగపతి.

"ఓహో ఏం పార్టీ చేశారు! ఎంత సంబరం చేశారు!! చూడూ ఈ జెర్రిపోతు లాంటి పూలదండ చూడు. నువ్వేమన్నా సరే నాకీ దండ మెడలోంచి తియ్యబుద్ధవలేదు."

"మా స్టాఫంతా కలిసి సుమారు నూట యాభై మంది. గ్రాండ్ ఫేర్‌వెల్ ఇదిగో ఈ స్వీట్లు, ఈ వాటర్ ఫిల్టర్ గుర్తుగా రోజూ వాళ్ళని తల్చుకోవాలిట."

వర్ధనమ్మ మునివేళ్ళతో తాకింది తళతళలాడే వాటర్‌ఫిల్టర్‌ని.

శుభ్రంగా తీసి చూడవే. రేపటి నుంచి దాన్నిండా నీళ్ళు పోసి పెట్టు. మంచి నీళ్ళకి ఇంక సమస్యే వుండదు."

వర్ధనమ్మ సంతోషంగా దాన్ని తీసి అటూ ఇటూ తిప్పి చూసి ఎంతో సంబరపడిపోయింది.

ఆ రోజు మంగపతి రిటైరైపోయాడు.

మంగపతికి కాస్త బెంగగా అనిపించినా ఆనందమే ఎక్కువగా ఉంది. ఎందుకంటే పొద్దుటినుంచి సాయంత్రం దాకా ఆఫీసరడిగే అడ్డమైన ప్రశ్నలకి సమాధానం చెప్పనవసరం లేదు. అదీ ఆనందం.

❖ ❖ ❖

ఉదయం లేవగానే వర్ధనమ్మ ఓపిక చేసుకుని భర్తకి పెసరట్లు వేసి పెట్టింది. అతను మహదానందపడిపోతూ తిన్నాడు.

"చూడు వర్ధనం. ఇలా హాయిగా పెసరట్లు తినడానికి ఎప్పుడూ కుదిరి చావలేదు. ఏదీ?? తొమ్మిది గంటలవకుండానే రెండు మెతుకులు నోట్లో వేసుకుని ఆఫీసుకి తగలడాల్సి వచ్చేది" వేడి చల్లారకుండా వూదుకుంటూ తిన్నాడు మంగపతి.

యాభై అయిదేళ్ళ వర్ధనమ్మ అయిదేళ్ళుగా అడపాతడపా అనారోగ్యంతో బాధపడుతూనే ఉంది. కీళ్ళవాతం వల్ల కూర్చుంటే లేవడం, లేస్తే కూర్చోవడం బాధాకరంగా వుందామెకి. చెయ్యాల్సింది ఇద్దరికే అయినా ఇంటిపని ఒక్కొక్కసారి భారమైపోతుందామెకి.

ఇంతవరకూ ఆమె ఉదయం లేవంగానే ఓపికనంతా కూడదీసుకుని కాఫీ చేసి వంట చేసి భర్తకి పెట్టి అతన్ని ఆఫీసుకి పంపి తను విశ్రాంతిగా వుండేది. మళ్ళీ రాత్రి పనికి ఓపిక సమకూర్చుకునేది. కానీ ఇప్పుడామె దినచర్య అకస్మాత్తుగా మారిపోయింది.

మంగపతి అటూ ఇటూ తిరిగి పేపరు చదివి పంచాంగం తిరగేసి పావు తక్కువ పన్నెండు గంటలకి స్నానానికి లేచాడు.

వర్ధనమ్మ అన్నీ అమర్చింది. ఒంటిగంటకి భోజనం చేసి విశ్రమించాడు మంగపతి. అవును మరి అతను ఉద్యోగం చేసి చేసి రిటైరయ్యాడు.

వర్ధనమ్మ అన్నీ సర్దుకుని నడుం వాల్చేసరికి సుమారు రెండు గంటలు దాటింది. ఆమె చాప మీద వొరికి అయిదు నిముషాలయిందో లేదో మంగపతి గంట నిద్ర పూర్తి చేసి లేచాడు.

"వర్ధనం కాస్త టీ పెట్టు" అన్నాడు లేస్తూనే.

ఆమె మారు మాట్లాడలేకపోయింది. కాళ్ళు స్వాధీనం కాకపోయినా ఎలాగో లాగ లేచి టీ పెట్టింది.

మూడున్నర గంటలవుతుంటే –

"వర్ధనం వేడివేడిగా కాసిన్ని పకోడీలు చేద్దూ" అన్నాడు.

వర్ధనమ్మ వంటింట్లోకి అడుగుపెట్టింది. పకోడీలు తింటూ "ఇలా కొన్నాళ్ళు హాయిగా ఏ బాధ్యతా బరువు లేకుండా ఈ టైముకిది చెయ్యాలని నియమం లేకుండా వుండాలని ఎప్పటి నుంచో కోరిక" అన్నాడు మంగపతి.

వర్ధనమ్మేం మాట్లాడలేదు.

❖ ❖ ❖

"ఏమే ఏదైనా చెయ్యమంటే అలా ఏడుపు ముఖం పెడతావేం? ఇన్నేళ్ళూ ఉద్యోగంలో పడి క్షణం సుఖం లేకుండా వున్నాను. ఇప్పుడే కదా కాస్త తీరిగ్గా వున్నదీ."

అవును మరి. అతను ఉద్యోగం చేసి అలసిపోయి రిటైరయి ఉన్నాడు.

వర్ధనమ్మ దినచర్య పూర్తిగా మారిపోయింది వారం రోజుల్లో. తెల్లవారి లేస్తూనే టిఫిన్, కాఫీ చెయ్యాలి. అదీ రోజుకొక రకం. పన్నెండుకో, ఒంటిగంటకో భోజనం ఏర్పాటు చేయాలి. అదీ నాలుగు రకాల నవకాయ రుచులతో, మూడు గంటలకి టీ పెడితే అయిదు గంటలకి కరకరలాడుతూ ఏదో తినాలని ఉంటుంది మంగపతికి.

మరీ ఇంట్లోనే అయిపోతోందని పార్కు దాకా షికారు కెళ్ళివస్తే రాత్రి కాళ్ళు లాగుతాయి.

"ఇదిగో వర్ధనం కాస్త ఈ పాదాల మీద నీ చెయ్యి వేద్దూ" అమ్మయ్య చల్లని నీ చెయ్యి నొప్పి ఇట్టే లాగేస్తుంది".

అకస్మాత్తుగా మారిన అలవాట్లు వల్ల మంగపతిరావు. మూడు రోజులు అనారోగ్యం వల్ల మూలపడ్డాడు. ముక్కులు మూలుగులు. అతను మళ్ళీ మామూలుగా అయ్యేసరికి రాత్రి నిద్రలేక, పగలు విశ్రాంతి లేక వర్ధనమ్మ నీరసపడిపోయింది.

❖ ❖ ❖

ఆ రోజు మంగపతి ఆఫీసులో రావలసిన డబ్బులు వసూలు చేసుకునేందుకు వెళ్ళాడు.

కోయవాడు వద్దన్నా వినకుండా వర్ధనమ్మని నిలబెట్టి మరీ జోస్యం చెప్పాడు.

"భూదేవంతా సహనం, మూడుకాళ్ళతో నడుస్తూ కూడా భర్త సేవ చేసుకుంటావు. అబ్బో ఎనభై ఏళ్ళ ఆయువుంది. పునిస్త్రీగా ఎల్లిపోతావు."

లోపలికొచ్చి వర్ధనమ్మ వంటరిగా చాపేసుకుని పడుకుంది. మధ్యాహ్నపు మగత నిద్రలో వర్ధనమ్మ వేరే లోకానికి ఎక్కడికో ప్రయాణమైంది. ఎవరెవరో ఎదురవుతున్నారు. కనిపించిన ప్రతివాళ్ళనీ ఆశగా ఆర్తిగా అడుగుతోంది.

"అయ్యా నాకూ రిటైర్‌మెంట్ కావాలి. నేనేం చేస్తే నాకది లభిస్తుంది? ఇరవయ్యో ఏట ఈ పనిభారం స్వీకరించాను. కష్టాలు పడ్డాను. కాన్పులు కన్నాను. బిడ్డల్ని పెంచాను. రోగాలనీ రొస్టులను నా వళ్ళు గుల్ల చేసుకుని అందరికీ ఆయువు పోసాను. పిల్లలు పెద్దవాళ్ళయి వారి బతుకువారు బతుకుతున్నారు. అమ్మ గురించే ఆలోచించే తీరికెక్కడిది వారికి పాపం.

కానీ,

ఈ అరిగిన కాళ్ళతో చెదిరిన శక్తితో మందగించిన దృష్టితో నేను సేవలు చేయలేకపోతున్నాను. నేనీ పాతివ్రత్య ధర్మాన్ని నిర్వర్తించలేకపోతున్నాను.

అయ్యా నువ్వెవరు?

ఇంద్రుడివా? చంద్రుడివా? మహావిష్ణువివా? పరమశివుడివా? ఎవరికి నేను ఆర్జీ పెట్టుకోవాలో చెప్పు నాయనా? నాకూ ఉద్యోగ విరమణ కావాలి.

(ఆంధ్రప్రభ, 10.1.1992)